క్లుప్తంగా

బీజేపీ నేతల పూజలు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భారత సైన్యం, ప్రధానమంత్రి, త్రివిధ దళాధిపతులు, దేశ ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని కోరుకుంటూ బీజేపీ నాయకులు స్థానిక పాతబస్తీ కెనాల్‌రోడ్డులోని వినాయకుని దేవస్థానంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బబ్బూరి శ్రీరామ్, 37వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఉత్తమ్‌చంద్ భండారీ, పశ్చిమ నియోజకవర్గం కన్వీనర్ పొట్టి శ్రీహరి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి వెంకట్, సిభూసింగ్, విశాల్ జైన్, మహేష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



విజయవాడ కల్చరల్: తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ సమితి, సంగీత సామ్రాట్ సంగీత సంస్థ, కేవీ బ్రహ్మానంద రావు కళావేదిక ఆధ్వర్యంలో నెల వారీ సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా భక్తి సంగీతం, సీతారామ కల్యాణం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గాయనీ గాయకులు మల్లీశ్వరి, శ్యాంప్రసాద్, స్వాతిమీరా కుమార్, అయ్యప్ప రాంమాంజీలు పలు భక్తి గీతాలను ఆలపించారు. సినీ నటి, విఖ్యాత హరికథా భాగవతారిణి పడాల కల్యాణి హరికథాగానం చేశారు. సాయిబాబు వైలెన్‌పై, మృదంగంపై పి.చైతన్య సహకరించారు. సంగీత విద్వాంసుడు కేవీ బ్రహ్మానందరావు మాట్లాడుతూ హరికథా సంప్రదాయాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. చింతకాయల చిట్టిబాబు, కె.డేవిడ్‌రాజు, ఆదిరాల జయప్రభ తదితరులు పాల్గొన్నారు. నిర్వాహకులు హరికథా భాగవతారిణి కల్యాణిని ఆత్మీయంగా సత్కరించారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



పటమట(విజయవాడతూర్పు): ఉమెన్ వరల్డ్ ఆర్గనైజేషన్, శ్రీస్నేహ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పటమట విజయ హాస్పిటల్ వద్ద ఉన్న అమ్మా ఓల్డేజ్ హోమ్‌లో శనివారం మాతృదినోత్సవం నిర్వహించారు. వృద్ధ మహిళలతో కేక్ కట్ చేయించి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు అవనిగడ్డ సునీత, యాదల శ్రీనివాసరావు, ప్రతినిధులు హెబ్సీ, లహరి, సునీతారెడ్డి, మీనా తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్):వేసవిలో ఎండలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తాగునీరు, మజ్జిగ పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త మల్లాది విష్ణు అన్నారు. 29వ డివిజన్ మధురానగర్‌లో శనివారం ఎస్కే చాంద్‌బాషా ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ కార్యక్రమం జరిగింది. మల్లాది విష్ణు ముఖ్య అతిథిగా పాల్గొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో సేవాకార్యక్రమాలు చేయాలని సూచించారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్కే బాబు, కె కొండలరావు, ఎస్కే చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా మరుగునే!



భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులో నిరుపయోగంగా ఉన్న పుష్కర మరుగుదొడ్డి



అదే రోడ్డులో నిరుపయోగంగా ఉన్న మరో మరుగుదొడ్డి

- నిరుపయోగంగా కరకట్టపై మరుగుదొడ్లు
- వెస్ట్ నియోజకవర్గంలో ఇటీవల కమిషనర్ పర్యటన
- మరుగుదొడ్లపై సిబ్బందికి ఆదేశాలు
- అమలు చేయాలంటున్న కరకట్ట వాసులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో అన్ని మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని, వాటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్న మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలపై భవానీపురం కరకట్ట వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న కృష్ణా పుష్కరాల మరుగుదొడ్లకు నిర్వహణ లేక తాళాలు వేశారు. కమిషనర్ తాజా ఆదేశాలతోనైనా వీటిని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరుగుదొడ్ల నిర్వహణపై ఆగ్రహం

ఈ నెల 8వ తేదీన కమిషనర్ భవానీపురం, ఆర్టీసీ వర్క్‌షాప్ రోడ్డు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, సీవీఆర్ ఫ్లై ఓవర్ ప్రాంతాల్లో పర్యటించి మరుగుదొడ్ల నిర్వహణపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనిపై భవానీపురం కరకట్టవాసుల స్పందిస్తూ కమిషనర్ పర్యటనలు, ఆదేశాలకే పరిమితం కావద్దని, కార్యాచరణకు నోచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కృష్ణా పుష్కరాలకు నిర్మాణం..

కృష్ణా పుష్కరాలను పురస్కరించుకుని పశ్చిమ నియోజకవర్గం గట్టు వెనుక ప్రాంతంలోని భవానీపురం 40, 41 డివిజన్ల పరిధుల్లోని కరకట్ట సౌత్ రోడ్డులో నగర పాలక సంస్థ మరుగుదొడ్లను నిర్మించింది. కృష్ణానదీ తీరాన ఉన్న పున్నమి ఘాట్, భవానీ ఘాట్‌లకు వచ్చే భక్తులతోపాటు స్థానికుల ప్రయోజనార్థం నిర్మించిన మరుగుదొడ్లు పుష్కరాలు పూర్తయ్యే వరకు వినియోగంలో ఉన్నాయి. ఆ తరువాత వాటి గురించి పట్టించుకున్న నాథుడు లేకపోవడంతో మూతపడి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. కృష్ణా పుష్కరాల నాటి నుంచి ఇప్పటి వరకు నగర పాలక సంస్థ కమిషనర్లు మారినా పుష్కర మరుగుదొడ్ల గురించి ఎవరూ పట్టించుకోక పోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన ప్రతి కమిషనర్ అధికారులు, సిబ్బందితో కలిసి నగరంలో పర్యటించటం మామూలైపోయిందని, ప్రజా ధనం వృథా కావడంపై ఎవరూ దృష్టి పెట్టటం లేదని వ్యాఖ్యానిస్తున్నారు.

నిర్వహణ గాలికి..

భవానీపురం కరకట్ట సౌత్ రోడ్డులో 2016లో వచ్చిన కృష్ణా పుష్కరాల సమయంలో నగర పాలక సంస్థ మూడు మరుగుదొడ్లు నిర్మించింది. పుష్కరాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థంతోపాటు కరకట్ట రోడ్డులో నివసించే పేద ప్రజలు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేసింది. వాటికి నీటి సౌకర్యంతోపాటు ఒక వాచ్‌మెన్, ఎప్పటికప్పుడు మరుగుదొడ్లు శుభ్రం చేసేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. పుష్కరాలు ముగిసిన తరువాత వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. ఈ క్రమంలోనే 41వ డివిజన్ పరిధిలో ఉన్న ఒక మరుగుదొడ్డిని ఆ డివిజన్ శానిటరీ కార్యాలయంగా మార్చుకుని వినియోగించుకుంటున్నారు. మిగిలిన రెండు పుష్కర మరుగుదొడ్లకు తాళాలు వేశారు.

వినియోగంలోకి తీసుకురావాలి

కేవలం పుష్కరాల కోసమే నిర్మించిన ఈ మరుగుదొడ్లు వివిధ సందర్భాలలో (దసరా ఉత్సవాలు, భవానీ దీక్షలు, మహాశివరాత్రి) అవసరం అవుతాయని, వాటిని వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. ఆయా ప్రత్యేక సందర్భాలలో లక్షలాది రూపాయల ఖర్చుతో పున్నమి, భవానీఘాట్లలో మొబైల్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు తప్ప నిరుపయోగంగా పడి ఉన్న పుష్కర మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావచ్చు కదా అన్నది భక్తుల వాదనగా ఉంది. లక్షలాది రూపాయలతో కృష్ణా పుష్కరాల్లో నిర్మించిన మరుగుదొడ్లను నిరర్థక ఆస్తులుగా వదిలేసారా అని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. లేదంటే 2028లో రానున్న కృష్ణా పుష్కరాలకే తాళాలు తీసి మళ్లీ వినియోగంలోకి తీసుకువస్తారా అని ప్రశ్నిస్తున్నారు. ఆయా మరుగుదొడ్లను కాపాడుకుంటే భవిష్యత్‌లో దసరా, భవానీ దీక్షల సమయంలోకూడా ఉపయోగపడతాయని ప్రజలు భావిస్తున్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు నివాళి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జమ్మూ కాశ్మీర్ సరిహద్దుల్లో పాక్ సైనికుల పాశవిక దాడిలో ప్రాణాలు కోల్పోయిన వీర జవాన్ మురళీనాయక్‌కు ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఘన నివాళులర్పించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం మురళీనాయక్ చిత్రపటానికి యూనియన్ నాయకులు నివాళులర్పించారు. శ్రీ సత్యసాయి జిల్లా గోరంట్ల మండలం కల్లి తండా చెందిన మురళి నాయక్ దేశ సరిహద్దుల్లో విధులు నిర్వహిస్తూ పాక్ సైనికుల పాశవిక దాడిలో గురువారం వీర మరణం చెందడం యావత్ జాతి గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. భారత్, పాక్ దేశాల మధ్య యుద్ధాన్ని నిలువరించి శాంతిని నెలకొల్పేందుకు ప్రపంచ దేశాలు చొరవ చూపాలని కోరారు. తొలుత ఐజేయు కౌన్సిల్ సభ్యుడు షేక్ బాబు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్షుడు చావా రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచల జయరాజ్, విజయవాడ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి, విజయవాడ అధ్యక్షుడు ఎంవీ సుబ్బారావు, యూనియన్ నేతలు జి.రఘురాం, శివరామకృష్ణ, అహ్మద్ హుస్సేన్, జీవన్ కుమార్, రూపాని రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇండియా పాకిస్తాన్ యుద్ధంలో దేశం కోసం ప్రాణాలు అర్పించిన వీరజవాన్ మురళినాయక్‌కు జనసేన పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. స్థానిక కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో ఆపార్టీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆపార్టీ ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి సామినేని ఉదయభాను, నాయకులు అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ మురళీనాయక్ సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బాడిత శంకర్, మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి అనూష, కార్పొరేటర్లు మహదేవ్ అప్పాజీ, మరుపిళ్ళ రాజేష్, అత్తలూరి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.



వీర జవాన్ మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

రైల్వే స్టేడియంలో వేసవి శిబిరం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శనివారం రైల్వే స్టేడియంలో సమ్మర్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథి రైల్వే ఏడీఆర్ఎం కొండా శ్రీనివాసరావు సీనియర్ డీఎస్‌సీ, డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వల్లేశ్వర బి.టితో కలసి క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ఎం మాట్లాడుతూ చిన్న వయసు నుంచే విద్యార్థులు క్రీడల్లో పాల్గొనడంతో వారిలో మానసిన, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. ఈ నెల 10 నుంచి జూన్ 7 వరకు జరిగే ఈ క్యాంప్‌లో పదహారేళ్లలోపు పిల్లలకు పలు క్రిడల్లో శిక్షన అందించనున్నట్లు తెలిపారు. క్యాంప్‌లో అనుభవజ్ఞులైన ట్రైనీల సమక్షంలో అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, వాలీబాల్‌తో పాటు పలు క్రీడల్లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఇటువంటి క్యాప్‌లతో పిల్లల్లో పట్టుదల, క్రీడా స్ఫూర్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పలు విభాగాల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవాలు ప్రారంభం

పెనమలూరు: పోరంకి గ్రామంలోని వసంత వేణుగోపాల స్వామి, ఆంజనేయస్వామి వారి ఆలయంలో కల్యాణ మహోత్సవం శనివారం ప్రారంభమైంది. రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణం మహోత్సవంలో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు స్వామివార్లను పెళ్లి కుమారుడిని చేశారు. సాయంత్రం 6 గంటలకు ఆలయంలో పార్థనా సూక్తం, విశ్వక్సేన పూజ, అంకురారోహణ, వాస్తు హోమం, ధ్వజారోహణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 11న ఉదయం 8 గంటలకు నిత్యహోమం, 9 గంటలకు శ్రీకృష్ణ మండలిచే పారాయణం, సాయంత్రం 6 గంటల నుంచి ప్రత్యేక పూజలు, రాత్రి 7.30 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామి వారికి దివ్య తిరు కల్యాణోత్సవం జరుగుతుందని ఈఓ సుబ్బారెడ్డి తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో వసంత వేణుగోపాలస్వామి

• చెట్ల కింద సేద



భగ్గుమంటున్న ఎండలకు ఇళ్లలో ఉండే వాళ్లే నానా అవస్థలు పడుతున్నారు. ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగించుకొని వేడి నుంచి రక్షణ పొందుతున్నారు. సొంత నివాసం లేని పేదలు పిల్లలతో సహా పెద్దలు కలిసి రోడ్డు పక్కన చెట్ల కింద నీడలో సేద తీరుతున్న దృశ్యం విజయవాడ సమీపంలోని ఫెర్రి పవిత్ర సంగమం వద్ద శనివారం కన్పించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

రోడ్లపై ఆవులను వదిలితే రూ.10 వేలు జరిమానా

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని రోడ్లపై ఆవులను వదిలిన యజమానులకు రూ. 10వేలు జరిమానా విధిస్తామని కమిషనర్ ధ్యానచంద్ర శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొంతమంది రోడ్లపై పశువులను వదిలిపెట్టడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగటమే కాకుండా ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ప్రజలకు అసౌకర్యం కలిగించే అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆవులను రోడ్లపై వదిలిపెట్టకుండా నియంత్రించేందుకు అజిత్ సింగ్ నగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కాటిల్ షెడ్‌లో గోవుల ఆరోగ్య సంరక్షణ కోసం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి.ఎస్.ఎస్. రెడ్డి పర్యవేక్షణలో ఉంటాయన్నారు. రోడ్లపై పశువులను వదిలిపెట్టకుండా సహకరించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొన్నారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం, పర్యావరణం పరిరక్షణే ఈ చర్యల ప్రధాన లక్ష్యమన్నారు.

దాసాంజనేయునికి సిందూర పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్):స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేసవి సెలవులు, పరీక్షా ఫలితాలు వెల్లడి కావటంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, భక్తులు ఆలయానికి చేరుకుని భక్తి శ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకుపూజలు నిర్వహించారు.వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు.

వెలగని వీధి దీపాలు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు):స్థానిక సిద్ధార్థ నగర్‌లోని ప్రధాన, అంతర్గత రహదారుల్లో విద్యుత్ లైట్లు వెలడం లేదు. దీనివల్ల చీకట్లోనే వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగిస్తున్నారు. సిద్ధార్థ నగర్‌లో రాత్రి సమయంలో వీధి దీపాలు (విద్యుత్ లైట్లు) వెలగకపోవడంతో స్టేట్ బ్యాంక్ కాలనీ-1, 2లోకి వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రాంతంలో వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే కోచింగ్ సెంటర్లు, బ్యూటీ పార్లర్లు, లేడీస్ హాస్టల్స్, రెస్టారెంట్‌లు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల వాహనదారుల రాకపోకలు ఇటుగా అధికంగా ఉంటాయి. రాత్రి సమయంలో విద్యుత్ లైట్లు వెలగక చీకటిగా ఉండటంతో బయటకు రావడానికి మహిళలు, హాస్టల్స్‌లో ఉండే యువతులు భయపడుతున్నారు. గత రెండు రోజులుగా విద్యుత్ లైట్లు వెలగడం లేదని స్థానికులు చెప్పారు. అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్ లైట్లు వెలిగేలా మరమ్మత్తులు చేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

సమ్మె జయప్రదం చేయాలని ర్యాలీ

కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 20వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె విజయవంతం చేయాలని ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర నాయకుడు వీ.బి.రాజు పిలుపునిచ్చారు. శిఖామణి సెంటర్‌లో గిరిపురం భవన నిర్మాణ రాడ్ బెండర్స్ కార్మికులు శనివారం ర్యాలీ నిర్వహించి సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడు తూ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు కొమ్ము కాస్తూ కార్మిక శక్తిని, కార్మికులను, 29 చట్టాలని తుంగలో తొక్కి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చి కార్మికుల ఉనికిని దెబ్బతీసే ప్రయత్నం చేస్తుందన్నారు. అత్యంత ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు అండగా ఉన్న సంక్షేమ బోర్డుని పని చేయించి కార్మికులకి అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర కార్యదర్శి బెనర్జీ, నాయకులు గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహించి సమ్మెకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేస్తున్న కార్మికులు

అంగన్‌వాడీల్లో తల్లికి వందనం

ఉయ్యూరు రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులను తల్లులు అక్షింతలతో ఆశీర్వదించారు. చిన్నారులు తమ తల్లుల కాళ్లకు వందనం చేశారు. కంకిపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజినీ మాట్లాడుతూ చిన్ననాటి నుండే విద్యార్థులకు తల్లిదండ్రుల పట్ల, గురువుల పట్ల, సమాజం పట్ల గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

పెనమలూరు: మదర్స్ డే సందర్భంగా మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం కార్యక్రమం శనివారం నిర్వహించారు. కానూరు మురళీ నగర్‌లో సంప్రదాయ పద్ధతిలో పిల్లలు తల్లుల కాళ్లుకడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. సూపర్‌వైజర్ విజయలక్ష్మి మాట్లాడుతూ నవ మాసాలు మోసి జన్మనిచ్చిన తల్లిని ప్రతీ బిడ్డ గౌరవించాలన్నారు. గోసాల, గంగూరు, వణుకూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పిల్లలు తల్లుల కాళ్లు కడగగా, తల్లులు పూలతో పిల్లలను ఆశీర్వదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కాశేశ్వరిదేవి, వి.జ్యోతి, పి.అనిత, పి.రంగమ్మ, కె.శిరీష, కె.శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.



కాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో తల్లుల నుంచి ఆశీర్వాదం పొందుతున్న చిన్నారులు



వణుకూరులో తల్లులకు వందనం చేస్తున్న చిన్నారులు

మధురానగర్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు సూచించారు. స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీ గంగోత్రి వాటర్ ప్లాంట్‌లో శనివారం మల్లాది విష్ణు యూత్, ఎస్కే బాబు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యాన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యసేవలు అందేలా ఉచిత వైద్య శిబిరంను ఏర్పాటు చేసిన ఎస్కే చాంద్ బాషాను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. తమ ప్రభుత్వ హయాంలో పేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించి అండగా ఉన్నామని చెప్పారు. ప్రముఖ వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్కే బాబు, ఎస్కే చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



మందులు పంపిణీ చేస్తున్న మల్లాది విష్ణు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించండి

తిరువూరు: పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తిరువూరు మండల సీపీఎం కార్యవర్గ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. కూటమి నాయకులు ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రజలపై ఎటువంటి భారాలు మోపమని హామీలిచ్చి ఇప్పుడు భారాలు మోపడం దుర్మార్గమన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



కంచికచర్ల: హైదరాబాద్ నుంచి విజయవాడకు బైక్‌పై వస్తుండగా శనివారం జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ బి.రాజు కథనం మేరకు విజయవాడ సున్నపు బట్టీల సెంటర్‌కు చెందిన మహ్మద్ రఫీ ఉజ్ జమాన్(45) అనే వ్యక్తి హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతని కుటుంబ సభ్యులు విజయవాడలో నివాసం ఉంటున్నారు. రఫీ పెద్ద కుమార్తె అనారోగ్యంతో బాధపడుతుందని భార్య ఫోన్ చేసి చెప్పింది. దీంతో రఫీ హైదరాబాద్ నుంచి బైక్‌పై విజయవాడ బయలుదేరారు. కంచికచర్ల సమీపంలోకి రాగానే ఫ్లై ఓవర్‌పై గోడకు బైక్ తగిలి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలవటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. రఫీ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దివ్యాంగులు, అనాథలకు అన్నదానం



దివ్యాంగులకు భోజనాలు వడ్డిస్తున్న శరాబందీరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): దివ్యాంగులు, అనాథలను ఆదరించాలని లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ అన్నాబత్తుల శరాబందీరావు సూచించారు. ఏలూరు రోడ్డులో శనివారం లయన్ సాల్మన్ రాజు ఆధ్వర్యాన దివ్యాంగులు, అనాథలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా శరాబందీరావు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీవీఆర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు హనుమంతరావు, కోశాధికారి రూపునాథ్, డీసీ ఇమామ్ బాషా, బంగారం, లక్ష్మణరావు పాల్గొన్నారు.